
సాక్షి నంద్యాల

శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



గువ్వలకుంట్లలో వైద్య బృందం

కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల గ్రామ ఎస్సీ కాలనీని గురువారం వ్యాధుల నిర్మూలన రీసెర్చ్ బృంద సభ్యులు సందర్శించారు. జ్వర బాధితుల నుంచి రక్త సేకరణ చేశారు. 8లో▸



శుభకరం.. వరలక్ష్మీ వ్రతం

శ్రీశైలంలోని చంద్రవతి కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించే వరలక్ష్మీవ్రతానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. వ్రతంలో పాల్గొనే వారి కోసం వేర్వేరు కలశాలు నెలకొల్పారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:24,033
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:23,623

న్యూస్‌రీల్

శ్రీశైలంలో 184 టీఎంసీల నీరు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయ నీటిమట్టం బుధవారం సాయంత్రం సమయానికి 879.30 అడుగులకు చేరుకుంది. జలాశయంలో 184.2774 టిఎంసీల నీరు నిల్వ ఉంది. బుధవారం నుంచి గురువారం వరకు శ్రీశైలానికి ఎగువ జూరాల, సుంకేసుల ప్రాజెక్ట్‌ల నుంచి 31,222 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 1,10,749 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. విద్యుత్ ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 70,124 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వార 35వేల క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 3,225 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. శ్రీశైలం డ్యాం పరిసర ప్రాంతాలలో 10.40 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కుడిగట్టు కేంద్రంలో 15.253 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.844 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

అలగనూరు గేట్లు బంద్

పాములపాడు: అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గేట్లు బంద్ చేశామని ఏఈ శ్రీనివాస నాయక్ గురువారం విలేకరులకు తెలిపారు. లాకీన్స్‌లా నుంచి నిప్పుల వాగుకు 200, తూడిచెర్ల సబ్‌చానల్‌కు 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. సుంకేసుల నుంచి కేసీ కెనాల్‌కు 2,200క్యూసెక్కుల నీరు వస్తోందని చెప్పారు.

పసుపు కొమ్ములతో మాలలు



పసుపు కొమ్ములను సిద్ధం చేస్తున్న దృశ్యం

మహానంది: శ్రీ కామేశ్వరి దేవి అమ్మవారికి రేపు (శ్రావణ మాసం మూడో శుక్రవారం) సుమారు 250 కిలోల పసుపు కొమ్ములతో మాలలు అలంకరించనున్నారు. అందులో భాగంగా పసుపు కొమ్ములతో మాలలను సిద్ధం చేస్తున్నారు. ఇలా అలంకరించిన అమ్మవారిని దర్శించడం ద్వారా భక్తులకు శుభాలు జరుగుతాయని ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెందూరి రవిశంకర్ అవధాని తెలిపారు.

ఏఎన్ఎం శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): ప్రాంతీయ శిక్షణా కేంద్రం (ఫిమేల్)లో ఎంపీహెచ్‌ఏ(ఏఎన్ఎం) కోర్సులో ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ వై. జయమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు మీడియంలో నిర్వహించే ఈ కోర్సు వ్యవధి రెండు సంవత్సరాలు కాగా.. ఇంటర్, వొకేషనల్, వన్‌స్టింగ్ ఉత్తీర్ణులైన మహిళలు అర్హులన్నారు. మొత్తం 40 సీట్లు ఉన్నాయని, 17 సంవత్సరాలు దాటిన వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్ల సడలింపు ఉంటుందన్నారు. దరఖాస్తున్ను రీజనల్ సెంటర్ లేదా cfw.in వెబ్‌సైట్ నుంచి తీసుకుని సెప్టెంబర్ 30వ తేదిలోగా సమర్పించాలన్నారు. అక్టోబర్ 15న ఎంపిక జాబితా ప్రచురిస్తామని, అదే నెల 21 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయన్నారు. శిక్షణలో ఉన్నప్పుడు నెలవారీ స్టైఫండ్ రూ.2వేలు మొదటి సంవత్సరం, రూ.2,500 రెండవ సంవత్సరం ఇస్తారని పేర్కొన్నారు.

జిల్లా టూరిజం శాఖ అధికారిగా లక్ష్మీనారాయణ

కర్నూలు కల్చరల్: జిల్లా పర్యాటక శాఖ అధికారిగా ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) కర్నూలు డివిజనల్ మేనేజర్ జి.లక్ష్మీనారాయణకు బాధ్యతలు అప్పగించారు. డీటీఓగా విధులు నిర్వహిస్తున్న విజయ ఆమె సొంత శాఖ ఐసీడీఎస్‌కు పీడీగా వెళ్లడంతో ఆ స్థానంలో లక్ష్మీనారాయణకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ(ఏపీటీఏ) డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉత్తర్వులు జారీ చేశారు.



నల్లమలలో నాటు వేట

నల్లమల అడవికి వెళ్లాలంటే ప్రజలు హడలిపోతారు. పెద్ద పులులు ఉంటాయని, ప్రాణాలు తీస్తాయని భయాందోళన వ్యక్తం చేశారు. అయితే ఇప్పుడు నల్లమలఅడవిలో పెద్ద పులుల గర్జనలు వినిపించడం లేదు. వేటగాళ్ల చేతుల్లో నాటు తుపాకులు గర్జిస్తూ వన్యప్రాణులను హతం చేస్తున్నాయి. అడవిలో 'మూడు తుపాకులు.. ఆరు తూటాలు' విరాజిల్లుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి.

- బలవుతున్న వన్యప్రాణులు
- వేటగాళ్లకు ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్
- తాజాగా అహోబిలంలో వేట
- అడవిలో యథేచ్ఛగా పేలుతున్న నాటు తుపాకులు
- అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణపై ఆరోపణలు

ఆళ్లగడ్డ: అభయారణ్యమైన నల్లమలలో ఎన్నో రకాల వణ్యప్రాణులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో అటవీ భూభాగం 1.60 లక్షల హెక్టార్లలో ఉంది. గుండ్లబ్రహ్మేశ్వరం, బండిఆత్మకూరు, నంద్యాల, చెలమ, రుద్రవరం, ఆత్మకూరు, బైర్లూటి, నాగలూటి, శ్రీశైలం, వెలుగోడు అటవీ రేంజ్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో 65 బీట్లు, 44 సెక్షన్లు ఉన్నాయి. అడవిలో చిరుతలు, పెద్దపులులు, ఎలుగుబంట్లు ఎక్కువగా ఉన్నాయి. అలాగే రేసు కుక్కలు, అడవి పిల్లులు, చుక్కల దుప్పులు, అడవి పందులు, కృష్ణ జింకలు, కుందేళ్లు, అడవి గొర్రెలు, నక్కలు కనిపిస్తాయి. బట్టమేక, అడవికోళ్లు, నెమళ్లతో పాటు వందలాది పక్షి జాతులకు నల్లమల ఆవాసం. అటవీశాఖ అధికారులు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా వన్యప్రాణుల మాంసం రుచి చూసిన వేటగాళ్లు యథేచ్ఛగా వేట మొదలెట్టారు. అహోబిలం, రుద్రవరం పరిధిలోని అడవుల్లో వేట నిత్యకృత్యమైంది. దుప్పులు, అడవి పందులు, జింకలు తదితరాల కోసం వేటగాళ్లు నాటు తుపాకులు వాడుతున్నారు. నల్లమందు, ఉచ్చులతో వన్యప్రాణులను వేటాడి, వాటి మాంసాన్ని బయట పట్టణాలకు, గ్రామాలకు తరలిస్తున్నారు.

స్థానికంగానే తయారీ..

అవసరమైన ట్రిగ్గర్, బ్యారెల్, గార్డ్, వాలా కమ్మీలు వేలూరు నుంచి తెచ్చుకుని స్థానికంగానే నాటు తుపాకులు తయారు చేసుకుంటున్నట్లు సమాచారం. పేర్నంబట్, గుడియత్తంలో నల్లమందు, గుండ్లు తీసుకొస్తున్నట్లు సమాచారం. వేటగాళ్ల నాటుతుపాకుల కారణంగా ఇప్పటికే కొందరు ప్రాణాలు కోల్పోయారు. మరి కొందరు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నా పోలీస్, అటవీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదన్న విమర్శలు ఉన్నాయి. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో రూ. 10వేలు ఇస్తే నాటు తుపాకీ దొరుకుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.



అహోబిలంలో పట్టుబడ్డ నాటుతుపాకులు (ఫైల్)

ఆ ఊరిలో ఇంటికో నాటు తుపాకీ!

నల్లమల పరిధిలో సుమారు ఐదు నెలలుగా నాటు తుపాకులతో ముమ్మరంగా వేటను సాగిస్తున్నారు. అహోబిలం గ్రామంలోని ఓ కాలనీలో ఇంటికో నాటు తుపాకీ ఉన్నట్లు సమాచారం. 2014 సార్వత్రిక ఎన్నికల ముందు గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించగా ఏకంగా ఒకేసారి 70 నాటుతుపాకులు లభ్యమయ్యాయి. 2023 లో తనిఖీలు చేపట్టగా 19 నాటు తుపాకులు లభ్యమయ్యాయి. ఇలాగే గతంలో కూడా అనేకమార్లు తనిఖీలు నిర్వహించగా దాచిపెట్టిన నాటు తుపాకులు పోలీసులకు, అటవీ అధికారులకు అప్పగించారు.

బ్రోకర్లతో కలిపి వాట్సాప్

వన్యప్రాణుల వేటగాళ్లు మాంసాన్ని విక్రయించేందుకు కొందరు బ్రోకర్లతో కలిపి వాట్సాప్ గ్రూపులు నిర్వహిస్తున్నారు. పొట్టేలు, మేక మాంసం కిలో రూ. 800 నుంచి రూ. 900 ఉంది. వన్యప్రాణుల మాంసం రూ. 500 లోపే విక్రయిస్తున్నారు. ఆరోగ్యానికి మంచిదని, వివిధ రకాల రోగాలకు ఆయుర్వేదంగా ఉపయోగపడుతుందని అనేక మంది వన్యప్రాణుల మాంసం కొనుగోలు చేసి ఎండబెట్టుకుని ఒట్టి ముక్కలు (ఎండు మాంసం) గా మార్చుకుని నిల్వ చేసుకుంటున్నారు. మాంసం ఫొటోలు వాట్సాప్ చేసిన వెంటనే ఎవరికి ఎన్ని కిలోలు కావాలో ఆర్డర్ ఇచ్చి తర్వాత ఫోన్‌పే ద్వారా డబ్బులు పే చేస్తున్నారు. దుప్పి మాంసం కిలో రూ. 500, అడవి పంది రూ. 300, అడవి కోడి రూ. 600, ఉడుము రూ. 700, జత పక్షులు రూ. 200, జింక కిలో మాంసం రూ. 600 అమ్మకాలు సాగుతున్నట్లు సమాచారం.

విదేశాలకు అక్రమ రవాణా?

వన్యప్రాణుల అవయవాలు, చర్మాలు, గోర్లు, పళ్లు తదితర వాటిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఆలుగు జంతువు మాంసం, చర్మం, పొలుసులో అరుదైన ఔషధ గుణాలు మెండుగా ఉంటాయని నమ్ముతారు. ఖరీదైన వస్త్రాలు, అభరణాల్లోను వాడుతారు. ఇదే అదనుగా వేటగాళ్లకు పదో పరకో ఇచ్చి విదేశాలు అయిన చైనా, వియత్నాంలకు రవాణా చేసేందుకు బ్రోకర్లు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇవీ దారుణాలు..

- నాటు తుపాకులతో వన్యప్రాణులను వేటాడటమే కాకుండా శత్రువులపై పగ తీర్చుకునేందుకు సైతం ఉపయోగించిన సంఘటనలు అనేకం ఉన్నాయి.
- కొంత కాలం క్రితం అహోబిలంలో భార్యాభర్తలు ఇద్దరు ఇంట్లో నాటు తుపాకీ గాయాలతో మృతి చెందారు.
- గత కొంత కాలం క్రితం వివాహేతర సంబంధం అనుమానంతో వేటకోసం అని రామాంజనేయులు అనే వ్యక్తి నరసింహులను అడవిలోకి తీసుకుపోయి నాటు తుపాకీతో కాల్చగా గురి తప్పి పెద్దన్న అనే వ్యక్తికి తగలడంతో తీవ్రంగ గాయపడ్డ సంఘటన సంచలనం లేపింది.
- గత మూడు రోజుల క్రితం ఐదుగురు వేటగాళ్లు రెండు దుప్పులను వేటాడి వాటి చర్మాలు తీసి దాచి పెట్టి తలలు కాల్చి వండుకుని తిని, మాంసం ఓ టీడీపీ నేత దుకాణంలో కవర్లలో ప్యాక్ చేస్తు తుపాకులతో సహా దొరికిపోయారు.



నాటు తుపాకీతో అటవీ అధికారులకు పట్టుబడ్డ వేటగాడు(ఫైల్)

శిక్షలు కఠినం

1972, 2022 చట్టాల ప్రకారం వన్యప్రాణులను చంపడం, చర్మాలు, మాంసాన్ని విక్రయించడం నేరం. చట్టంలోని షెడ్యూలు 1, 2, 3 ప్రకారం పులి, చిరుత, మొసలి, పాములు, కొండగొర్రెలు, జింకలు, నెమలి, వాలుగ, దుప్పులు, మనుబోతు, అడవిపందులు, కుందేళ్లు, ముళ్ల పంది, ఉడుములు తదితర వన్యప్రాణులను చంపితే 3 నుంచి 7 ఏళ్లపాటు జైలుతోపాటు రూ లక్ష వరకు జరిమానా విధిస్తారు. వన్యప్రాణులను వేటాడిన వారితో పాటు సహకరించిన వారు, మాంసం కొనుగోలు చేసి తిన్నవారు, విషయం తెలిసినా, చూసినా చెప్పకపోవడం కూడా నేరం కిందే పరిగణిస్తారు. ఇంత కఠినమైన చట్టం ఉన్నా ఒకరిద్దరిని తప్ప మిగతా వారిని అదుపులోకి తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

అవసరమైన ప్రాంతాలకు యూరియా

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలో అవసరమైన ప్రాంతాల్లో యూరియా నిల్వలను వినియోగించాలని అధికారులను జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనవసరంగా యూరియా వాడడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై కూడా ప్రచారం చేయాలన్నారు. కలెక్టరేట్ నుంచి అధికారులతో గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్‌లో భాగంగా నమోదైన బంగారు కుటుంబాలకు త్వరితగతిన మార్గదర్శులను గుర్తించి మ్యాపింగ్ చేయాలన్నారు. పెండింగ్ ఉన్న నీడ్ అసెస్మెంట్ సర్వేను వేగవంతం చేయాలన్నారు. డీఆర్ఓ రామునాయక్, సీపీఓ వేణుగోపాల్, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ లలిత, అదనపు మున్సిపల్ కమిషనర్ దాసు, జీజీహెచ్ సూపరింటెండెంట్ మల్లీశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్‌దీపాలంకరణలో శ్రీ రాఘవేంద్ర స్వామి, రాములోరి విగ్రహాల ప్రాంతం



వేద భూమి.. నేటి నుంచి ఉత్సవ దీప్తి

మంత్రాలయం: వేద భూమి అయిన మంత్రాలయంలో శ్రీగురు రాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టనున్నారు. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో ఉత్సవ ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. మంత్రాలయం పుర వీధులు విద్యుద్దీపాలతో వెలుగుగొందుతున్నాయి. శ్రీమఠం కారిడార్, ప్రాకారాలు, వసతి నిలయాలు దీపకాంతుల తేజస్సుతో విరాజిల్లుతున్నాయి. మఠం ప్రాకారాలు విరుల పరిమళాలు వెదజల్లుతున్నాయి. శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణతో ఆరాధనకు అంకురార్పణ పలకనున్నారు. లక్ష్మీపూజ, ధాన్యపూజ, గజ, అశ్వ, గోపూజలు అశేష భక్తజనవాహిని మధ్య జరగనున్నాయి. శుక్రవారం రాత్రి ఊంజల మంటపంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు ఊంజల సేవ, ఛామర్ల సేవలు ఉంటాయి.



వెలుగులీనుతున్న ముఖద్వారం

వీబీఆర్ నుంచి నీరు విడుదల

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి దిగువకు 14,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలుగుగంగ ఏఈ శివనాయక్ తెలిపారు. గురువారం బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వీబీఆర్‌కు 13,700 క్యూసెక్కుల నీరు వచ్చి చేరినట్లు చెప్పారు. ప్రస్తుతం వీబీఆర్‌లో 14.706 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్స్

కర్నూలు (అర్బన్): జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరానికి ఉపకార వేతనాలను అందించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా తెలిపారు. 9, 10వ తరగతి చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా http://scholarships.gov.inలో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ చదువుతున్న విభిన్న ప్రతిభావంతులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్ ద్వారా http://scholarships.gov.inలో అక్టోబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్ట్రంలో బీసీలకు రక్షణ కరువు

- వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్‌నాయుడు

నంద్యాల: రాష్ట్రంలో బీసీలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్ నాయుడు అన్నారు. పులివెందులలో బీసీ నాయకుడైన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై హత్యాయత్నం చేయడం దారుణం అన్నారు. నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్ ఆర్చి వద్ద ఉన్న జ్యోతిబా పూలే (జ్యోతిరావు గోవిందరావు పూలే) విగ్రహానికి పూలమాలవేసి అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బోగోలు శివశంకర్ నాయుడు మాట్లాడుతూ.. జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే టీడీపీ గూండాలు హత్యాయత్నాలకు పాల్పడుతున్నారన్నారు. బీసీ నాయకుడు అయిన ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ కారును చుట్టుముట్టి దాడి చేయడమే కాకుండా అద్దాలు పగలగొట్టి కారుపై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నం చేశారన్నారు. దాడికి పాల్పడిన వారు బయట తిరుగుతున్నా పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. బీసీలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుండటం మంచిది కాదన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బీసీ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ పుల్లయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి చిన్నబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి శశికళ, రాష్ట్ర మత్స్యశాఖ మాజీ డైరెక్టర్ శేఖర్, నంద్యాల మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ, జిల్లా స్టూడెంట్ వింగ్ సురేష్ యాదవ్, పంచాయతీ రాజ్ వింగ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామ్, లక్ష్మణ్, చాబోలు మహేష్‌నాయుడు, వాల్మీకి నాగరాజు, మల్లెల ప్రసాద్, జాకీర్, సుదర్శన్‌యాదవ్, సుధాకర్, రమణయాదవ్, మద్దిలేటియాదవ్, బొల్లవరం రమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నంద్యాలలో పూలే విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొండెక్కిన కొబ్బరి.. చేదెక్కిన బెల్లం!



- భగ్గుమంటున్న నూనె ధరలు
- సామాన్యుడికి కూర'గాయాలు'

నంద్యాల(న్యూటౌన్): నిత్యావసర సరుకుల ధరలు కొండెక్కాయి. ఎర్రగడ్డలు, ఎండుమిరప పప్పు, ఉప్పు, బెల్లం, అల్లం.. అన్ని నిత్యావసర సరకులు ప్రియం అయ్యాయి. కూరగాయల ధరలు అమాంతంగా పెరిగి సామాన్యుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. మార్కెట్‌కు రూ.100 నోటు తీసుకుని వెళితే కనీసం రెండు రోజులకు సరిపడా కూరగాయలు కొనలేని దుస్థితి నెలకొంది. వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో కూరగాయల సాగు ప్రారంభం కాలేదు. దీంతో మిర్చి, క్యారెట్, బీట్ రూట్, బీన్స్, క్యాబేజీ, క్యాప్సికమ్ ధరలు చుక్కలను చూపుతున్నాయి.

రైతు బజార్లు ఏవీ?

నంద్యాల పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో రైతు బజార్లు ఏర్పాటు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. పట్టణంలో, మండల కేంద్రంలో మరి కొన్ని రైతు బజార్లు ఏర్పాటు చేసినట్లయితే రైతులు నేరుగా తీసుకువచ్చి ప్రజలకు కూరగాయలు అమ్ముకునేందుకు వీలుంటుంది. ప్రస్తుతం మార్కెట్లో వ్యాపారులు చెప్పిందే ఇష్టారాజ్యంగా మారింది. కూరగాయల ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని హోల్‌సేల్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఉద్దానంలో పండే బీర, కాకర, సొర, బెండ కాయలు ఆగస్టు నెలాఖరు నాటికి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. అప్పటి వరకు ధరలపై నియంత్రణ ఉండేలా రెవెన్యూ, మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, లేదంటే తాత్కాలికంగానైనా రైతు బజార్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ధరలు మండిపోతున్నాయి



ప్రస్తుతం మార్కెట్లో కూరగాయల ధరలు మండి పోతున్నాయి. సామాన్యులుగా మంచి కూరగాయల కొనలేకపోతున్నాం. ధరలను ప్రభుత్వం నియంత్రించకుంటే ఎలా? తోట కూర కట్ట రూ.20 అమ్ముతున్నారు. రెండు అరటి కాయలు రూ.20 పలుకుతున్నాయి. ధరలు ఆకాశాన్ని అంటడం బాధకరం. అధికారులు ధరలు నియంత్రించాలి. – లక్ష్మీదేవి, నంద్యాల

రైతు బజార్లు ఏర్పాటు చేయాలి

నంద్యాల పట్టణంలో రైతు బజార్లు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి. పండించే కూరగాయలను రైతు బజార్లలో విక్రయాలు జరిగేలా చూడాలి. ప్రస్తుతం నంద్యాల మార్కెట్లో కూరగాయలు కొనలేకపోతున్నాం. కిలో బెండకాయులు రూ.50, ఆగాకర కాయలు రూ.280 చెబుతున్నారు. కొనేందుకు ధైర్యం చేయలేకపోతున్నాం.
– వెంకటేశ్వరమ్మ, నంద్యాల

నిత్యావసర ధరలు ఇవీ.. (కిలోకు రూపాయల్లో..)

	గతేడాది	ప్రస్తుతం
కొబ్బర	180	350
ఎండు మిర్చి	120	160
చింతపండు	100	140
బెల్లం	50	65
పామాయిల్	90	120
సన్‌ఫ్లవర్	112	145

కూరగాయల ధరలు ఇవీ... (కిలోకు రూపాయల్లో..)

	ప్రస్తుతం	గత మూడు రోజుల క్రితం
బీన్స్	120	100
చిక్కుడు	80	60
క్యాప్సికం	100	80
క్యారెట్	70	50
కాకర	60	40
బీర	60	40
బీట్‌రూట్	60	50
వంకాయాలు	60	40
దొండ	60	40
మిర్చి	100	40
బెండ	50	40
క్యాలీఫ్లవర్	100	80
టమాటా	60	40

క్లుప్తంగా

లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

- బస్సు డ్రైవర్లకు గాయాలు


ప్రమాదానికి గురైన బస్సు

వెల్దుర్తి: కర్నూలు – బెంగళూరు జాతీయర రహదారిపై వెల్దుర్తి పట్టణ సమీపంలో గురువారం తెల్లవారుజామున ముందువెళ్తున్న లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదవశాత్తు ఢీకొంది. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికులతో వెళ్తున్న మార్నింగ్ స్టార్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మార్గమధ్యలో వెల్దుర్తి సమీపంలో లద్దగిరి క్రాస్ రోడ్ హనుమాన్ జంక్షన్ వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. జంక్షన్‌లో స్పీడ్ బ్రేకర్లను గమనించి లారీ డ్రైవర్ వేగం తగ్గించడంతో వెనుక వస్తున్న బస్సు డ్రైవరు అదుపు చేయలేక లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం దెబ్బతినగా, డ్రైవర్ సిద్దు విలాస్‌తో పాటు పక్కన కూర్చున్న మరో డ్రైవర్ అనిల్ గాయపడ్డారు. సంఘటనాస్థలికి చేరుకున్న హైవే పోలీసులు క్షతగాత్రులను 108లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ప్రయాణికులు ఇతర బస్సులో తమ గమ్యస్థానాలకు వెళ్లిపోయారు.

వైఎస్సార్‌సీపీ 'మేధావుల' కార్యదర్శిగా తిరుమలేశ్వర రెడ్డి



కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శిగా కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పాటిల్ తిరుమలేశ్వర రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రస్థాయి పదవి అప్పగించడంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నీటికుంటలో పడి వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని జమ్మలమడుగు రోడ్డులో గురువారం నీటి గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు మేరకు.. కల్లూరుకు చెందిన లారీ డ్రైవర్ పీరా కుమారుడు చంద్‌బాషా (26)ను వెంట పెట్టుకొని ఈనెల 5వ తేదీన జమ్మలమడుగు క్రాస్ రోడ్డులోని లారీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం వద్ద బాడగ కోసం వేచి ఉన్నారు. రెండు రోజుల క్రితం నుంచి చాంద్‌బాషా కనిపించకపోవడంతో తండ్రితో పాటు తోటి డ్రైవర్లు వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలోనే పోలీస్ ఫ్యాక్టరీకి చెందిన నీటికుంటలో మృతదేహం కనిపించింది. సమాచారాన్ని పోలీసులకు అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మద్యం మత్తులో గుంతలో పడిపోయాడా.. ప్రమాదశాత్తూ పడిపోయాడా.. అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మోసం చేశాడు.. న్యాయం చేయండి


ప్రియుడి ఇంటి ముందు దీక్ష చేపట్టిన యువతి

దేవనకొండ: తనను మోసం చేశాడని ప్రియుడు ఇంటి ముందు ఓ యువతి దీక్ష చేపట్టింది. మండలంలోని పాలకుర్తి గ్రామానికి చెందిన స్వర్ణకుమారి పి.కోటకొండ గ్రామానికి చెందిన బండమీది రాజు ఐదేళ్ల నుంచి ప్రేమించుకున్నారు. రాజుకు మరో యువతితో పెళ్లి సంబంధం చూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్వర్ణకుమారి గురువారం ఉదయం పి.కోటకొండకు చేరుకుని రాజు ఇంటి ఎదుట నిరాహార దీక్షకు పూనుకుంది. దీంతో యువకుడి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. రాత్రయినా యువతి అక్కడే ఉంది. ఈ విషయంపై దేవనకొండ సీఐ వంశీనాథ్‌ను వివరణ కోరగా రాజు తనను మోసం చేశాడని 20 రోజుల క్రితం స్వర్ణకుమారి ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శుభకరం.. వరలక్ష్మీ వ్రతం

- నేడు శ్రీశైల ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- విస్తృత ఏర్పాట్లు చేసిన దేవస్థానం

శ్రీశైలంటెంపుల్: 'వర' అంటే శ్రేష్ఠమైనది అని అర్థం. ప్రతీ ఒక్కరు కూడా వారి వారి రంగాలలో శ్రేష్ఠతను ఆశిస్తారు. అవిధమైన శ్రేష్ఠతను ప్రసాదించే దేవిస్వరూపమే.. వరలక్ష్మి. కేవలం ధనం, ధాన్యం, కీర్తి మొదలైన భౌతిక సంపదలనే కాకుండా, ఉత్సాహం, ఉల్లాసం, ఆనందం లాంటి మానసిక సంపదలను, ధ్యానశక్తి, యోగశక్తి, మోక్షం లాంటి ఆధ్యాత్మిక సంపదలను కూడా వరలక్ష్మి అనుగ్రహిస్తుంది. శ్రావణమాసంలో శుక్రవారం రోజున ఆచరించే వరలక్ష్మీ వ్రతానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. ఈ వ్రతాన్ని ఆచరించడం వలన లక్ష్మీదేవి కృపకు పాత్రులై ఐశ్వర్యంతో పాటు సకల శుభాలు కలుగుతాయని, మహిళలకు దీర్ఘకాల సుమంగళి భాగ్యం దక్కేలా దేవతలు దీవిస్తారని పురాణ కథనం. ఈ వ్రతాచరణ గురించి శివుడు స్వయంగా పార్వతీదేవికి చెప్పినట్లు స్కందపురాణం, భవిష్యోత్తర పురాణాలు చెబుతున్నాయి. వ్రతం ఆచరించడం వలన పార్వతీదేవికి కుమారస్వామి జన్మించాడని చెబుతారు. శ్రావణ మాసంలో పౌర్ణమి ముందుగా వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించాలి. ఆ రోజున వీలుకాకపోతే శ్రావణమాసంలో ఆచరించవచ్చు.

వరలక్ష్మీ వ్రతాచరణ ఇలా..

వ్రతం రోజున ఉదయాన్నే ముత్తయిదువులు మంగళస్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించాలి. పూజకు నిర్ణయించుకున్న స్థలంలో మండపాన్ని ఏర్పాటు చేయాలి. మధ్యలో కలశాన్ని నెలకొల్పి లక్ష్మీదేవి ముఖాన్ని తీర్చిదిద్దిన కొబ్బరికాయ దానిపై ఉంచాలి. అనంతరం లక్ష్మీదేవిని కలశంలోకి ఆహ్వానింపజేసి వ్రత విధానంతో పూజించాలి. వివిధ రకాల పిండివంటలు, పలు రకాల పండ్లను నివేదించాలి. ఈ వ్రతంలో తోరపూజ (తొమ్మిది పోరలు కలిగిన ధారం) చేయాలి. పూజ ముగిశాక ఆ తోరణాన్ని కుడిచేతికి కట్టుకోవాలి. తరువాత ముత్తైదువులకు వాయనాన్ని ఇవ్వాలి. వాయనం అంటే రవిక, పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, గంధం మొదలైన మంగళద్రవ్యాలను, తమలపాకులు, వక్కలను చాటలో ఉంచి ముత్తైదువులకు ఇవ్వడం. శక్తిమేర ఒక్కరికి లేదా ముగ్గురు, ఐదుగురికి ముత్తైదువులకు ఈ వాయనాన్ని ఇవ్వొచ్చు. సాయంత్రం ముత్తైదువులను పిలిచి, పేరంటం చేసి, పూలు, పండ్లు, తాంబూలంగా ఇవ్వాలి.



శ్రావణమాసం..శుభకరం:

చాంద్రమానం ప్రకారం సంవత్సరంలో ఐదవ మాసం శ్రావణమాసం. ఈ మాసంలోని పౌర్ణమి నాడు చంద్రుడు శ్రవణ నక్షత్రానికి చేరువలో ఉండడం వలన శ్రావణమాసమనే పేరు వచ్చింది. శుభకార్యాలకు ఈ మాసం చాలా అనువైంది. అందుకే శ్రావణమాసానికి శుభమాసమనే పేరు కూడా ఉంది. ఈ నెలలో నోములు, వ్రతాలు, పండుగలతో ప్రతి ఇల్లు కళ కళలాడుతుంది. రుతువుల్లో మూడోదైన వర్ష రుతువు ఈ మాసంతోనే ప్రారంభమవుతుంది. దీంతో వ్యవసాయ పరంగా కూడా ఈ మాసానికి ప్రాధాన్యత ఉంది.

సామూహిక వరలక్ష్మీ వ్రతానికి ఏర్పాట్లు పూర్తి

శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే వరలక్ష్మీవ్రతానికి దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. శ్రీశైలంలోని చంద్రవతి కల్యాణ మండపంలో నిర్వహించే ఈ వ్రతంలో పాల్గొనే ప్రతి ముత్తైదువు కోసం వేర్వేరు కలశాలు నెలకొల్పి శాస్త్రోక్తంగా వ్రతాన్ని చేసుకోవడానికి ఏర్పాట్లు చేశారు. వ్రతంలో పాల్గొనే ముత్తైదువల పేర్లు ముందుగా నమోదు చేసుకున్నారు. ఈ వ్రతంలో పాల్గొనే ముత్తైదువులందరికి అమ్మవారి శేష వస్త్రాలు, జాకెట్ పీస్, పూలు, గాజులు, ప్రసాదం అందిస్తారు. వ్రతాచరణకు వీలుగా శ్రీస్వామిఅమ్మవార్ల కైలాస కంకణాన్ని ధరింపజేస్తారు. వ్రతం అనంతరం శ్రీశైలప్రభ సంచికను అందిస్తారు. పూజా సామగ్రి మొత్తం దేవస్థానమే సమకూరుస్తుంది. వ్రతానంతరం ముత్తైదులందరికీ స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించబడుతుంది. దర్శనం అనంతరం దేవస్థానం అన్నపూర్ణ భవనంలో భోజన సదుపాయం కల్పిస్తారు.


శ్రీశైల ఆలయం

ఆటోలో 60 లీటర్ల సారా పట్టివేత


సారాతో పట్టుబడిన ఆటోతో ఎక్సైజ్ అధికారులు

కర్నూలు: ఆటోలో భారీగా సారా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో కర్నూలు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్, ఎస్ఐ నవీన్ బాబు ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించి మూడు సంచుల్లో 600 ప్యాకెట్లు (60 లీటర్లు) నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. కొల్లంపల్లి తాండాకు చెందిన జటావత్ లక్ష్మీబాయి, పెద్దకొట్టాల గ్రామానికి చెందిన మహబూబ్ బాషా ఆటోలో సారా తరలించి లక్ష్మీపురం గ్రామంలోని సందెపోగు కనక సూర్యం ఇంటి ముందు దింపుతుండగా ఎక్సైజ్ పోలీసులు కాపు కాసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఆటోతో పాటు సారాను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ చంద్రహాస్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది ఈరన్న, మధు, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, రాజు, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బంగారుపేటలోని నాటుసారా స్థావరాలపై ఈఎస్‌టీఎఫ్, కర్నూలు టూటౌన్ పోలీసులతో కలసి ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి సారా బట్టీలను ధ్వంసం చేశారు.

హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక...

కోడుమూరు రూరల్: హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేక ఓ విద్యార్థిని హాస్టల్ సిబ్బందిని, తల్లిదండ్రులను బెదిరించే ప్రయత్నంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కోడుమూరులో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ 8వ తర గతి చదువుకుంటున్న ఓ విద్యార్థినికి మొదటి నుంచి హాస్టల్లో ఉండి చదువుకోవడం ఇష్టం లేక ఇంటికెళ్తానని మొండికేసేది. ఈ విషయంపై గతంలో హాస్టల్ వార్డెన్‌తో పాటు, పాఠశాల ఉపాధ్యాయులు సైతం ఆ విద్యార్థినికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయితే మనసు మార్చుకోని ఆ విద్యార్థినీ ఎలాగైనా ఇంటికి వెళ్లాలన్న ఉద్దేశంతో గురువారం స్వల్ప మోతాదులో ఫినాయిల్ తాగి బెదిరించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న హాస్టల్ వార్డెన్ శిరీష ఆ బాలికను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు చికిత్సనందించి ఎలాంటి ప్రాణాపాయం లేదని చెప్పారు. దీంతో హాస్టల్ వార్డెన్ బాలిక తల్లిదండ్రులను పిలిపించి జరిగిన విషయాన్ని వారికి చెప్పి బాలికను అప్పగించారు. అయితే తన తల్లిదండ్రులను భయపె ట్టాలనే క్రమంలో విద్యార్థిని చేసిన పనిని పలువురు తప్పుబడుతున్నారు.

గువ్వలకుంట్లను సందర్శించిన వైద్య బృందం


జ్వర బాధితులతో మాట్లాడుతున్న రీసర్చ్ బృందం

కొత్తపల్లి: విష జ్వరాలతో మంచం పట్టిన గువ్వలకుంట్ల గ్రామం ఎస్సీ కాలనీని గురువారం వ్యాధుల నిర్మూలన రీసెర్చ్ బృందం సందర్శించింది. బృందం సభ్యులు కాలనీలో మురికి కుంటలు, నీరు నిల్వ ఉన్న ప్రదేశాలు, కాలనీ నీటి సరఫరా చేసే బావులను, ఇళ్లలోని నీటి తొట్టిలు, డ్రమ్ములు, ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా మైక్రో బయాలజీ వైద్యులు సచిన్ సుమంత్ మాట్లాడుతూ.. విష జ్వరాలకు కారణాలు తెలుసుకునేందుకు ముందుగా జ్వర బాధితుల నుంచి రక్త సేకరణ చేశామన్నారు. వీటిని వ్యాధి నిర్ధారణ పంపిస్తామన్నారు. గ్రామస్తులు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట జనరల్ ఫిజీషియన్ శంకర్ నరేన్, కమ్యూనిటీ మెడిసిన్ డాక్టర్ జాహ్నవి, డిస్ట్రిక్ట్ ఎపిడమాలజిస్ట్ రమేష్, కొత్తపల్లె వైద్యాధికారులు దీపా నాగవేణి, మహమ్మద్ బేగ్, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఉన్నారు.

రవీంద్ర విద్యార్థులకు జాతీయ స్థాయి బహుమతులు


విద్యార్థులను అభినందిస్తున్న రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య

కర్నూలు సిటీ: ఢిల్లీలో ఇటీవల జరిగిన స్టీమ్ ఇన్నోవేషన్ లీగ్ 2కే 25 ''ఇండియాస్ లార్జెస్ట్ ఏఐ అండ్ రోబోటిక్స్ కాంపిటీషన్ ఫోకస్డ్ అరౌండ్ ఇన్నోవేషన్'' పేరుతో నిర్వహించిన పోటీలలో స్థానిక అబ్బాస్‌నగర్‌లోని రవీంద్ర పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో బహుమతులు సాధించారు. ఈ మేరకు గురువారం ఆ స్కూల్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు జి.పుల్లయ్య పాల్గొని బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 335 జట్లు పోటీల్లో పాల్గొన్నాయని, ఇందులో తమ స్కూల్ విద్యార్థులు హఫీపా, సమీరా, లిఖిత డ్యూయల్ పర్పస్ వీల్ చైర్ స్ట్రెచర్ బెడ్ ఫర్ హాస్పటల్స్ అనే నమూనాను తయారు చేసి జాతీయ స్థాయిలో తృతీయ బహుమతి సాధించారన్నారు. పిల్లల్లో వచ్చే అద్భుతమైన ఆలోచనలు భావితరానికి నాంది పలకాలని ఆయన విద్యార్థులకు సూచించారు. రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జీపీఎం మోహన్ కుమార్, వైస్ చైర్మన్ జి.వంశీధర్ విద్యార్థులను అభినందించారు. కార్యకమంలో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జ్ వి.రమేష్ రంజిత్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ మాజీ కౌన్సిలర్లు


టీడీపీ మాజీ కౌన్సిలర్లకు కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: పట్టణానికి చెందిన 3వ వార్డు టీడీపీ మాజీ కౌన్సిలర్ కనికె లక్ష్మీదేవి, ఆమె కుమారుడు టీడీపీ పట్టణ ఇన్‌చార్జ్ చేనేత మల్లికార్జున, 30వ వార్డు టీడీపీ మాజీ కౌన్సిలర్ మధుబాబు తమ అనుచరులతో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో జరిగిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో వారు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుట్టా రేణుకతో పాటు పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టాప్రతుల్, సీనియర్ నాయకుడు బుట్టా శివ నీలకంఠ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన మధుబాబు మాట్లాడుతూ.. ఎమ్మిగనూరులో ఇద్దరి ఎమ్మెల్యేల పాలన సాగుతుందని షాడో ఎమ్మెల్యేని ఉద్దేశించి విమర్శలు చేశారు. చేనేత మల్లికార్జున మాట్లాడుతూ.. ఎమ్మిగనూరుకు చేనేతల కోసం క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని బుట్టారేణుకను కోరారు. టెక్స్‌టైల్ పార్క్‌తో చేనేతలను మభ్యపెట్టేందుకు ఎమ్మెల్యే బీవీ పట్టణంలో భూమి పూజ చేశారని ఆరోపించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రజా సంక్షేమ పాలనలో ప్రజలు బాగుపడ్డారని, టీడీపీ ప్రజల సంక్షేమాన్ని అభివృద్ధిని విస్మరించడంతో తాము వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు.


సాగు చేయాలంటే వాగు దాటాల్సిందే!


కొర్రవాగు నీటిలో దిగి అవతలకు వెళ్తున్న రైతు

- వాగు అవతల వందలెకరాల భూమి
- వర్షాకాలం వచ్చిందటే ప్రాణాలు చేతిలో పెట్టుకొని అవతలకు..
- బ్రిడ్జి నిర్మించాలని రైతుల వేడుకోలు

పాణ్యం: ఆ గ్రామ రైతులు పంటలు సాగు చేయాలంటే వాగులో పీకల్లోతు నీరున్నా దాటి అవతలకు వెళ్లాల్సిందే. లేకుంటే నాలుగైదు కిలోమీటర్లు ప్రయాణించి పొలాలకు చేరుకోవాలి. కొన్నేళ్లుగా రైతులు పడుతున్న కష్టాలు వర్ణణాతీతం. ఇక వర్షాకాలంలో రైతులు బాధలు చెప్పలేనివి. మండల పరిధిలోని అహల్యాపురంలో గ్రామంలో రైతుల పరిస్థితి ఇదీ. గ్రామం పక్కనే కొర్రవాగు ప్రవహిస్తుంది. ఈ వాగులో వేసవిలో తప్ప నిత్యం నీటి ప్రవాహం ఉంటుంది. ఇటీవల వర్షాలు కురవడం, ఎస్సార్బీసీ కాల్వలకు నీరు వదలడంతో వాగులో పీకల్లోతు వరకు నీరు ప్రవహిస్తుంది. వాగు అవతల వందల ఎకరాల సాగు భూమి ఉంది. వాగు దాటితే కిలోమీటరు.. లేదా అర కిలోమీటరు దూరంలో పొలాలకు చేరుకుంటారు. ప్రస్తుతం పొలాలకు విత్తనాలు వేసే సమయం కావడంతో రైతులు వాగులో నీటిని దృష్టిలో పెట్టుకొని ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, మహిళా కూలీలు, పనిముట్లతో చుట్టు నాలుగైదు కిలోమీటర్ల దూరం తిరిగి పొలాలకు చేరుకుంటున్నారు. అలా వెళ్లలేని రైతులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోని పీకల్లోతు నీటిలో దిగి అతి కష్టంమీద వాగు దాటుతున్నారు. పొలంలో విత్తనాలు వేసేందుకు కూలీలను తీసుకెళ్లాలన్నా, మందుల బస్తాలు తీసుకెళ్లాలన్నా నరకయాతన అనుభవిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. గతంలో అనేక ప్రమాదాలు జరిగాయని, అధికారులు ఈ అవస్థల నుంచి గట్టెక్కించాలని కోరుతున్నారు. వాగుపై బ్రిడ్జి నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ఎద్దు దాడిలో వృద్ధుడి మృతి


మృతిచెందిన పద్మనాభ దాస్ (ఫైల్)

ఆలూరు రూరల్: వృద్ధుడిపై ఎద్దు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఘటన గురువారం ఆలూరులో చోటు చేసుకుంది. స్థానిక బళ్లారి రోడ్డులో నివాసం ఉండే పద్మనాభ దాస్ (89) మెయిన్ బజారులోని ఓం శాంతి ధ్యాన మందిరానికి వెళ్లి వస్తుండగా ఎద్దు దాడి చేసింది. కొమ్ములతో వృద్ధుడిని ఎత్తి కింద పడేసింది. ప్రమాదంలో పద్మనాభ దాస్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గమనించి ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఆదోనికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడు పద్మనాభ దాస్ ఆలూరు మాజీ ఎమ్మెల్యే గోవింద దాస్ తనయుడు.

పశువుల బారి నుంచి కాపాడండి..

రహదారులపై సంచరిస్తున్న పశువుల బారి నుంచి ప్రజలను కాపడాలని సీపీఎం నాయకులు అంబేడ్కర్ సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో పశువులు విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలపై దాడులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గతంలో పశువుల దాడిలో చాలా మంది గాయపడ్డారని రోడ్లపై అడ్డదిడ్డంగా పరిగెత్తే పశువుల వల్ల వాహనదారులు కింద పడ్డారన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు ఇప్పటికైనా మేల్కొని పశువులను గోశాలకు తరలించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు హనుమంతు, నారాయణ స్వామి, మైనా, కృష్ణ, ఈరన్న, షేకూన్‌బీ తదితరులు పాల్గొన్నారు.


24 మందికి 60 టన్నుల యూరియా!

- కూటమి పార్టీల నేతలకు మాత్రం పుష్కలంగా సరఫరా
- సామాన్య రైతులకు దొరకని యూరియా


కౌతాళంలో ఎరువుల కోసం రైతులు నిరీక్షణ(ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): ఒక బస్తా యూరియా లభించక సాధారణ రైతులు ఇబ్బందులు పడుతుంటే కొందరికి మాత్రం ఎంత కావాలంటే అంత లభిస్తోంది. జూలై నెలకు సంబంధించి జిల్లాలో 24 మంది అత్యధికంగా యూరియా వినియోగించడం గమనార్హం. వీరందరూ టీడీపీకి చెందిన వారే కావడంతో అంతటా చర్చనీయాంశమైంది. ఒక్కొక్కరు ఒక్క నెలలోనే రెండున్నర టన్నుల ప్రకారం వినియోగించినట్లు స్పష్టమవుతోంది. కేవలం 24 మంది పెద్ద రైతులు 60 టన్నుల యూరియను తరలించుక పోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు యూరియా కోసం రైతులు రోడ్డెక్కుతుంటే వచ్చిన యూరియా కూటమి పార్టీలకు చెందిన వారికి తరలుతుందనేందుకు ఇదే నిదర్శనం. 24 మందిపై విచారణ నిర్వహించాలని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆదేశించింది. జిల్లాలో యూరియా కోసం రైతులు గగ్గోలు పెడుతున్నారు. దాదాపు అన్ని మండలాల్లో యూరియా కోసం రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం యూరియాతో సహా అన్ని రకాల రసాయన ఎరువులను ఈ–పాస్ మిషన్‌ల ద్వారానే ఆన్‌లైన్‌లో విక్రయించాలి. విక్రయించే ప్రతి బస్తా ఏ రోజుకారోజు ఆన్‌లైన్‌లో నమోదు కావాలి. అపుడే జిల్లాలో ఎరువుల నిల్వ ఎంత ఉందనేది తెలుస్తుంది. జిల్లాలో ప్రయివేటు డీలర్లు, రైతుసేవా కేంద్రాలు, పీఏసీఏస్‌లు, డీసీఎంఎస్‌ల్లో మాన్యువల్‌గానే యూరియా అమ్మకాలు సాగిస్తున్నారు. విక్రయించిన ఎరువుల వివరాలను తీరిక ఉన్నప్పుడు ఈ–పాస్ మిషన్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అందువల్ల ఆన్‌లైన్‌లో ఎరువులు భారీగా కనిపిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఒక్క బస్తా కూడా లభించని పరిస్థితి ఏర్పడింది. ల్లాలో ఏలాంటి యూరియా కొరత లేదని కంపెనీ గోదాముల్లో 2,263 టన్నులు, హోల్‌సేల్ డీలర్ల దగ్గర 440, మార్క్‌ఫెడ్ దగ్గర 6,072, రీటైల్ డీలర్ల దగ్గర 2,527, రైతు సేవా కేంద్రాల్లో 1,112, పీఏసీఎస్, డీసీఎంఎస్‌ల్లో 428 టన్నుల ప్రకారం జిల్లాలో 12,842 టన్నుల ప్రకారం యూరియా ఉందని చెబుతున్నారు. ఇదే విషయాన్ని జిల్లా వ్యవసాయ యంత్రాంగం జిల్లా కలెక్టర్‌కు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ కూడా దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారు. ఆన్‌లైన్‌లో ఉన్న ఈ లెక్కలను చూసి యూరియా పుష్కలంగా ఉందనే ఉద్దేశంతో ప్రభుత్వం కర్నూలు జిల్లాకు కేటాయింపులు భారీగా తగ్గించేస్తోంది. దీంతో ఎరువుల కొరత ఏర్పడి సామాన్య రైతులు ఆందోళన బాటపడుతున్నారు.

వానాకాలంలోనూ ఎండుతున్న గొంతులు!


జీడీపీ కాల్వ నుంచి నీటిని తీసుకెళ్తున్న మహిళ

వానాకాలంలోనూ ప్రజలు దాహార్తితో అల్లాడుతున్నారు. బిందె నీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. కోడుమూరు మండలం కొత్తపల్లిలో ఈ దుస్థితి నెలకొంది. గ్రామంలో 500 మంది నివాసం ఉంటున్నారు. గత రెండు వారాల నుంచి రెండు బోర్లు మరమ్మతులకు గురై నీరు రావడం లేదు. దీంతో గ్రామస్తులు కిలోమీటర్ దూరాన ఉన్న వ్యవసాయ బోర్లు, బావులు, జీడీపీ కాల్వను ఆశ్రయించి తాగునీటికి తెచ్చుకుంటున్నారు. 'కుళాయిలకు నీరు రాక, 70 ఏళ్ల వయస్సులో కిలోమీటర్ దూరాన ఉన్న వ్యవసాయ బావికి వెళ్లలేక ఇబ్బంది పడుతున్నా' అని గ్రామానికి చెందిన కుమ్మరి గిడ్డయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు స్పందించాలని కోరాడు. – కోడుమూరు రూరల్


బిందెను ఎత్తుకెళ్తున్న వృద్ధుడు


కాల్వలో నీటిని తీసుకెళ్తున్న దృశ్యం


వ్యవసాయ బోరు నుంచి నీటి బిందెలను బైక్‌పై తీసుకెళ్తూ..